# అమాయిక చేసిన మహాపరాధం

"మహేశ్వర్"

'ఏమేవ్- ఒసే!'

'అబ్బ- వస్తున్నానండి-'

'లోపల ఏమిటా రాచకార్యం?'

'ఒచ్చేలోగానే ఇంత ఒరాకా? రాచ కార్యం కాదు- మీ చెల్లెలి కార్యమే! జడ వేస్తున్నా!'

'బావుంది వరసం! ఇదేంటి కొంపముంచిన పని చేసేవ్?'

'ఏంచేసేనండి? ఏమీ ఎరగనే!?'

'ఆ సంగనాచి కబుర్లే వద్దన్నది! నువ్వు రాజద్రోహివి! ప్రభుత్వ ద్రోహివి! కాంగ్రెస్ ద్రోహివి!'

'ఇదేం ఖర్మం అండీ! నేను పర్మిట్లు బ్లాక్‌లో అమ్మలేదే! లంచాలు పుచ్చుకోలేదే!'

'అటువంటివాటి అన్నింటినీ మించిన అపరాధం!'

'ఎందుకొచ్చిన గొడవం, తెల్లారగానే! విషయమేదో చప్పున తేల్చరాదూ చంపక?'

'గట్టిగా మాట్లాడకు పరువుపోతుంది! దేశారిష్టంకనులు!'

'నేనే అప్రతిష్టపన్నూ చెయ్యలేదండీ!'

'ఇంకా అదేమాటా! నువ్వూ నేనూ దాచినా ప్రకృతి దాచగలదా?'

'అవతల పొయ్యి మండి పోతూంది, త్వరగా తేల్చండీ.'

'ఇది ఎన్నో సంఖ్య?'

'నాకా శాస్త్రం తెలీదండీ! చెప్పేదేదో సూటిగా చెప్పండి!'

'ఇటీవల మధురలో మంత్రి సంజీవరెడ్డిగారేమన్నారో పేపర్లో చదివేనా?'

'నాగురించి ఆయనకేం తెలుసునండీ, అనేందుకు?'

'నీలాంటివాళ్ళ గురించే అన్నాడాయన!'

'పాడు పత్రిక నేను చూడలేదండీ!'

'లోకజ్ఞానం కలిగించేది పాడు పత్రికా? అమూల్యమైన మంత్రుల అభిభాషణలు మనకు అందిచ్చేవి పాడు పత్రికలా?'

'కాదుకాదు అన్నీ భగవద్గీతలు! ఏమఘోరించేవో చెప్పరాదూ?'

'నీలాంటి వాళ్ళకి నోట్లో గడ్డి పెట్టేయి!'

'ఇంతకీ నేనేం చేసేనండీ?'

మంత్రిగారి ఆజ్ఞని జవదాటి దేశాపచారం చేసేవ్!

'ఏమిటా మహాపాతకం?'

'నానోటంటే చెప్పించాలని చూస్తున్నావా? హా సంజీవా! నా భార్య అజ్ఞానాన్ని క్షమించు ప్రభూ!'

'మీ కివాళ మతిపోయిందా ఏమిటి?'

'నిజంగా పోయింది! దేశకాల పరిస్థితులని కళ్ళారా చూస్తూ పత్రికలు చదువుతూ నువ్వీ అనర్థం తెచ్చిపెడతావని కలలోనైనా తలంచలేదు!'

'ఏమీ అర్థంలేదు- కాస్త తలంటి స్నానం చేసి పడుకోండి!'

'ఇదంతా తమాషా అనుకున్నావా? నీ ప్రోగ్రెస్ తగలెయ్యా! ఇది అయిదో గర్భం కాదూ?'

'ఆ...వ్వ...! దీనికా ఇంత రాద్ధాంతం!'

'కాదేం మరి? మంత్రిగారు జనాభివృద్ధిని అరికట్టమని, తిండి పెట్టలేని ప్రభుత్వానికి సహకరించమని కోరుతున్నారు!'

'వీళ్ళ ఖజానాలో డబ్బు మనకేం ఇచ్చి పోషిస్తున్నారా? కని, పెంచే మనకిలేని కష్టం వీళ్ళకెందుకూ?'

'సోవియట్ రష్యాలో పిల్లల్ని గవర్నమెంటే పెంచుతుంది. ఆవిధంగా మనదేశంలో పుట్టిన పిల్లలందర్నీ సంజీవరెడ్డిగారే పెంచుతూన్నట్టుగా ఫీలౌతున్నారు-ఎంత బాధ్యత, ఎంత బరువు!'

'అఘోరించినట్టే వుంది! ప్రకృతి మీదే ఒక 'యాక్టు' పెట్టమనండి!'

'తప్పు తప్పు, మనం ప్రభుత్వానికి సహకరించి, అక్షరాలా మంత్రుల సందేశాలు శిరసావహించిన నాడే దేశానికి ముక్తి!'

'ఐతే ఇప్పుడేం చెయ్యమంటారు?'

'ఇప్పుడేం చెయ్యగలం? వచ్చే ఏడాది నుంచైనా జాగ్రత్తగా వుండాలి!'